చింతపర్రులో సమస్యల తిష్ట

- దోమలు, కీటకాలతో ప్రజల అవస్థలు
- నివాసాల మధ్య పశువుల పాకలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రులో పారిశుద్ధ్యం క్షీణించడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నివాసాల మధ్య పశువుల పాకలు. ఈ గ్రామంలో కొబ్బరి కాయ వర్తకులు ఎక్కువ. దీంతో వారి ఇళ్ల ముందు కొబ్బరికాయ ఒలిచిన డొక్కతో నిండిపోయి ఉంటుంది. దీంతో పాటు గ్రామంలో మురుగు డ్రెయిన్‌లో నీరు పారుదల లేక చెత్త పెరిగిపోయి ఉంటుంది. ఈ డ్రెయిన్‌లో దోమలకు ఆవాసంగా మారింది. ఈ డ్రెయిన్‌కి ఆనుకుని ఉన్న ప్రజలు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. ఇటీవల ఈ గ్రామంలో 20 మందికి పైగా జ్వరాల బారిన పడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. గ్రామంలో ఇళ్ల మధ్య పశువుల పాకలు నిలయంగా మారాయి. పెంటకుప్పలు కూడా ఇళ్లమధ్యనే ఉంటాయి. దీంతో ఈ పెంట కుప్పల్లో ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్నాయని వాపోతున్నారు.

విద్యార్థులకు అవస్థలు

పాఠశాల పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. తుప్పలు పెరిగిపోయాయి. ఈ తుప్పల్లో విష పురుగులు పెరిగి విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు సుమారు 600కి పైగా ఉన్నాయి. అలాగే పెరటి కోళ్లు కూడా 1000కి పైగా ఉన్నాయి. వీటి వల్ల గ్రామంలో అపరిశుభ్రతకు కారణమని గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా గేదెలు మకాం ఇళ్ల మధ్య ఉండడం వల్ల వర్షానికి పెంటకుప్పలతో కలిసిన నీరు ఇళ్ల ముందుకి వచ్చి దోమలు పెరిగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు.


చింతపర్రులో జనావాసాల మధ్య ఉన్న పశువుల మకాం


చింతపర్రులో ఇళ్ల మధ్య డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయిన దృశ్యం

జ్వరంతో బాధపడ్డా



ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఇళ్ల మధ్య వర్షం నీరు నిలిచిపోతోంది. దీని వల్ల దోమలు పెరిగిపోయాయి. నాతో పాటు నా కుమారుడు కూడా జ్వరంతో బాధపడ్డాం. వారం రోజులు ఆసుపత్రిలో ఉండి కోలుకున్నాం. ఇళ్ల మధ్య డ్రెయిన్ శుభ్రం చేయాలి. మురుగునీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వరరావు, చింతపర్రు

పశువుల పెంపకందారులకు నోటీసులిచ్చాం



ఇళ్ల మధ్య పశువుల మకాం పెట్టవద్దని సంబంధిత యజమానులకు పంచాయతీ నుంచి నోటీసులిచ్చాం. ముఖ్యంగా వర్షాకాలంలో బాగా ఇబ్బందిగా ఉంటుంది. అలాగే గ్రామంలో జ్వరాలు ఎవరికీ లేవు. గ్రామంలో అన్ని డ్రెయిన్‌లలో ముగ్గు, బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ మందు స్ప్రే చేయించాం.

– గుమ్మాపు పెద్దిరాజు, సర్పంచ్, చింతపర్రు

వేగంగా ఈ-క్రాప్ నమోదు


మొగల్తూరులో పంట వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది


పెనుగొండలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న తహసీల్దారు అనితకుమారి

మొగల్తూరు: రైతులు తాము పండిస్తున్న పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. మొగల్తూరు గ్రామంలో వరినాట్లు వేసిన ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పాలకమ్మచెరువు తదితర ప్రాంతాలలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ప్రాంతాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండిస్తున్న పంట వివరాలను రైతు భరోసా కేంద్రంలో లేదా గ్రామ రెవెన్యూ అధికారి వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈక్రాప్‌లో నమోదు కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు వర్తించడమే కాకుండా ప్రకృతి విపత్తులు కారణంగా ఏర్పడే నష్టాన్ని పొందేందుకు అర్హులవుతారన్నారు. మొగల్తూరు మండలంలో ఇప్పటి వరకు 350 ఎకరాలలో నాట్లు వేయగా 190 ఎకరాలకు సంబంధించి ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేశారని వివరించారు.

ఈ-పంట నమోదు పరిశీలన

పెనుగొండ: మండలంలో ఖరీఫ్ 2024కు సంబంధిం ప్రతి రైతూ ఈ పంట నమోదు చేసుకోవాలని పెనుగొండ తహసీల్దారు జి అనితకుమారి అన్నారు. సోమవారం పెనుగొండలో ఈ-పంట నమోదును పరిశీలించారు. రైతు సోదరులు ఊడ్చిన పంట వివరాలను, రైతుల పూర్తి వివరాలను, పంట రకం, విత్తన రకం వంటి వివరాలు అన్నీ సర్వే నంబర్ల వారీగా, వారి రైతు సేవా కేంద్రాలలో విధిగా నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలు తెలుసుకోవడానికి వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలనుసంప్రదించాలన్నారు. ఈ-పంట నమోదును మండల వ్యవసాయాధికారి పి.స్పందన, ఆర్‌ఐ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకానికి అనుగుణంగా సేవలు

నరసాపురం: ప్రజల నమ్మకానికి అనుగుణంగా బ్యాంకు సేవలు సాగాలని రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నరసాపురం స్టీమర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వాణి కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు బ్రాంచ్ కార్యాలయాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తికి ఘన నివాళి

పెనుగొండ: పోరాటాల యోధుడు, సీపీఎం ఉమ్మడి జిల్లా పూర్వ కార్యదర్శి సభ్యుడు, రైతు సంఘం నేత వలవల శ్రీరామమూర్తి ధన్యజీవని సీపీఎం నాయకులు కొనియాడారు. సోమవారం ఆచంటలో సీపీఎం కార్యాలయం వద్ద వలవల శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సమావేశంలో శ్రీరామ్మూర్తి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు తలుపూరి బుల్లాబ్బాయి, తోటపల్లి సత్యనారాయన, నెక్కంటి కృష్ణమూర్తులు, సిర్రా నరసింహమూర్తి, ఎస్‌వీఎన్ శర్మ, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చిన చరిత్ర ఫొటోగ్రఫీదే


లూయిస్‌మాండ్ డాగురే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఫొటో గ్రాఫర్స్

నరసాపురం: ప్రపంచ గతిని మార్చిన చరిత్ర ఫొటో గ్రఫీదేనని పలువురు ఫొటో గ్రాఫర్లు అన్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నరసాపురం ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శివాలయం సెంటర్‌లో ఉన్న కెమెరా సృష్టికర్త డాగురే విగ్రహానికి పూలలు వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రాఫర్స్ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్స్ యూనియర్ అధ్యక్షుడు కేపిటల్ రాజు, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి కోట్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలు అన్వేషించాలి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి

యలమంచిలి: గ్రామ పంచాయతీలకు ఆదాయ మార్గాలు అన్వేషించాలని ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో సోమవారం జరిగిన పునశ్చరణ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండుటతో పాటు చెత్త నుంచి సంపదను సృష్టించాలనే ధ్యేయంతో ప్రతి గ్రామంలోను సంపద కేంద్రాలను నిర్మించామన్నారు. వాటిని వినియోగంలోనికి తీసుకోవడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని ఆయన కోరారు. వీధి దీపాల నిర్వహణ, ఉపాధి హామీ పనులపై ఆయన వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షేక్ అమీర్ షరీఫ్ సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి సర్పంచ్‌లు వల్లభసాయి వెంకట నరసింహారావు, పాలంకి శ్రీనివాస్, తుంగా అమూల్య, అనిశెట్టి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్రులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


జల్‌జీవన్ మిషన్ మిషన్ ద్వారా చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ86.10లక్షలతో చేపట్టబోయే 8 పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలోని శెట్టిబలిజపాలెం, బద్దావారి పేట, పెదపేట తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు ఈ పనులన్నీ రాబోయే గాంధీ జయంతి నాటికి పూర్తి కావాలని ఎమ్మెల్యే నాయకర్ ఆర్‌డబ్ల్యూయస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి వరలక్ష్మి, ఉపసర్పంచ్ అందే కవికుమార్, ఎంపీటీసీ పత్తి లక్ష్మి సంపూర్ణ, వలవల నాని, బందెల రవీంద్ర, పోలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజనం పరిశీలన

మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం సీతారామపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

బాధితులకు ముదునూరి పరామర్శ


కేపీ పాలెంలో చంద్రావతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేపీ పాలెం సౌత్ గ్రామానికి చెందిన బెల్లంకొండ చంద్రావతి, దొంగ గంగరాజు, కేపీపాలెం నార్త్ గ్రామానికి చెందిన తంగెళ్ళ భాస్కరరావు, చెన్నారపు సత్యనారాయణ, పేరుపాలెం నార్త్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు కోమ్మూరి సూరయ్యనాయుడు, మోడి గ్రామానికి చెందిన కడలి నారాయణ మూర్తి, ముత్యాలపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ కొపనాతి పల్లయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

అర్జీలు గడువులోపు పరిష్కరించాలి

భీమవరం: అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన «ప్రజా సమస్యల పరిష్కార వేదిక్ష కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. «ప్రజా సమస్యల పరిష్కార వేదిక్ష కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరిత గతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన

భీమవరం అర్బన్: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి యుండాలని భీమవరం ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం సూచించారు. భీమవరం మండలంలోని శ్రీరామపురం అంగన్‌వాడీ సెంటర్లో సోమవారం 100 రోజుల మిషన్ శక్తి పథకంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలపై కలిగే నష్టాలు గురించి, మహిళలపై దాడులు జరిగితే కఠిన శిక్షలు గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, ఏఎన్ఎమ్, ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్, కిషోర బాలికలు పాల్గొన్నారు.

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించాలి

కాళ్ల: జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధిస్తే ఉన్నత చదువుల వరకూ విద్యార్థికి ఆర్థిక సహకారం అందుతుందని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధన అంశంపై ఒక రోజు వర్క్ షాప్ సోమవారం నిర్వహించారు.ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వందేమాతరం ఫౌండేషన్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఐక్య నేషనల్ ఫౌండేషన్, సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలలోని 7, 8 తరగతి విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేకంగా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి భువనేశ్వరి, హెచ్ఎం నిర్మలాదేవి మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ ఎం శ్రీనివాస్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ వై శ్రీనివాసాచారి, వందేమాతరం ఫౌండేషన్ ఏపీ చైర్మన్ పేరిచర్ల అశోక్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

భారత్ బంద్‌కు సహకరించాలి

పాలకొల్లు అర్బన్: మాల బిడ్డల భవిష్యత్ తరాలకు వర్గీకరణ వల్ల జరిగే నష్టాలను వివరించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాలల ఐక్యంగా ముందుకు సాగాలని మాలమహానాడు రాష్ట్ర నాయకులు గుమ్మాపు సూర్యవర ప్రసాద్, నల్లి రాజేష్ పిలుపు నిచ్చారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో నియోజకవర్గ స్థాయి మాలమహానాడు నాయకుల సమీక్షా సమావేశం మానుకొండ శ్రీనుబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న భారత్ బంద్‌కు జాతీయ స్థాయి మాలమహానాడు ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపును పాలకొల్లులో విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి బంద్ విజయవంతం చేయాలని కోరారు. పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారణంగా వర్గీకరణ చిచ్చు తలెత్తిందన్నారు. పాలకొల్లులోని అన్ని విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు బంద్‌కి సహకరించాలని కోరనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాపాక నగేష్‌కరుణాకర్, గుమ్మాపు పెద్దిరాజు, నాయకులు ఉన్నమట్ల మునిబాబు, మద్దా చంద్రకళ, విప్పర్తి ప్రభాకరరావు, ఉచ్చుల స్టాలిన్, గుండె నగేష్, సరెళ్ల శ్రీనివాస్, పెదపాటి పెద్దిరాజు, కొరపాటి వీరాస్వామి, మోకా నరసింహారావు, విప్పర్తి నవీన్, దేవ నగేష్, ఉప్పె పండుబాబు, పానుకుమట్ల వీరాస్వామి పాల్గొన్నారు.

భారత్ బంద్‌కు సహకరించాలి

పెనుగొండ: వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ మాల మహానాడు, ఇతరసంఘాలు కలసి ఈ నెల 21న నిర్వహించనున్న భారత బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు ఏపీ అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మాల సోదరులు , ఉద్యోగులు మేధావులు, విద్యార్థులు, నాయకులు హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు.

క్లుప్తంగా

వనమల్లికార్జునుడికి జలాభిషేకం


జలాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: స్థానిక వడయార్‌పేటలో ఉన్న శ్రీ భ్రమరాంభ సమేత వనమల్లికార్జునుడికి సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ఉత్తరభారత దేశంలో నిర్వహించినట్లుగానే దక్షిణాదిలోని మన ప్రాంతంలోను నిర్వహించాలనే ఆలోచనతో శ్రావణ మాసంలో సోమవారాలు అభిషేకాలు చేస్తున్నారు.గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు 25 కావిడలతో తీసుకువచ్చిన జలంతో స్వామి వారికి జలాభిషేకం చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీ పార్వతి

మొగల్తూరు: గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లక్ష్మీ పార్వతి కోరారు. మొగల్తూరులోని కోట ప్రాంతంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆమె రోగులకు అవగాహన కల్పించారు. రోగాలను ముందుగా గుర్తించడం వల్ల మంచి వైద్యం అందుతుందన్నారు. ఈ సందర్భంగా 135 మందిని పరీక్షించి 12 మందికి సుగర్, 38 మందికి బీపీ ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సిబ్బంది విరాజిత, కె.సాంబశివరావు, రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జిరాజు

మొగల్తూరు: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు సోమవారం నుంచి ప్రారంభమైన మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం పంచాయతీ తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన బాధ్యతలు, సర్పంచ్ అధికారాలు, విధులు, స్వయం సహాయక సంఘం విధులు, భాగస్వామ్యం, పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికలు తయారీ వంటి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు ఎం.నవీన్ కిరణ్, కేఎస్‌ఎన్ రాజు, వై.కృష్ణ, పి.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో ఉచిత వైద్య శిబిరం


సిద్ధాంతంలో ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెనుగొండ: సిద్ధాంతం పంచాయతీ వద్ద కిమ్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం వైద్య శిబిరాన్ని సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వలన గ్రామీణులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారికి ఉచితంగా మందులు ఇచ్చామని, 12 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించడంతో ఉచితంగా శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ బృందం పాల్గొన్నారు.

రజకులను ఆదుకోవాలి

పాలకోడేరు: రజకుల చెరువులపై దళారీలు పెత్తనం పెరిగి లీజులను విపరీతంగా పెంచేస్తున్నారని రజక సంఘం జిల్లా నాయకుడు యండమూరి నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పాలకోడేరులో ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వజ్జుపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని లీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

21న ఆక్వారంగంపై అవగాహన సదస్సు

ఆకివీడు: ఆక్వా రంగంపై అవగాహన సదస్సు ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ ఆక్వా ల్యాబ్ , శిక్షణా కేంద్రంలో నిర్వహించనున్నట్లు మండల మత్స్య శాఖాధికారి సీహెచ్ రాంబాబు సోమవారం చెప్పారు. ఎంపెడా, అప్సడా రిజిస్ట్రేషన్ల కార్యక్రమం ఉంటుందని, అనంతరం ఆక్వా సాగులో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తారని తెలిపారు.

వృద్ధులకు గొడుగుల పంపిణీ


వృద్ధులకు గొడుగులు పంపిణీ చేస్తున్న సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వృద్ధులు సంరక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం చట్టపరిధిలో పని చేసినా ఆరోగ్య పరంగా, కుటుంబ పరంగా, ఆర్థిక పరంగా ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగా నరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో 100 మంది వృద్ధులకు, వికలాంగులకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యర్రంశెట్టి వెంకటరత్నం, గుత్తుల సత్యనారాయణ, కలిదిండి వెంకటపతివర్మ, వేగేశ్న వెంకట తిరుపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 26 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లాకుపేట అప్రోచ్ రోడ్డు నిర్మించాలి

నరసాపురం: 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న లాకుపేటకు అప్రోచ్‌రోడ్డు నిర్మించాలని దళితసంఘం నేత తెన్నేటి సురేష్ కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. 216 జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినా కూడా అప్రోచ్‌రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు.

ఉత్సాహంగా రాఖీ వేడుకలు

పెనుగొండ: సోదరీ, సోదరుల బంధానికి చిహ్నంగా జరుపుకొనే రాఖీ పండుగ ఊరూవాడా ఉత్సాహంగా గడిపారు. సోమవారం ఆచంట నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ మండలాల్లో అన్న, తమ్ముళ్లకు, అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకొన్నారు. అక్క చెల్లెళ్లకు నేనున్నానంటూ రక్షగా నిలుస్తామంటూ రాఖీలు కట్టారు. ఆచంట, పెనుగొండ మండలాల్లోని ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అఖిల భారతీ శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలోనూ. మూలవిరాట్ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ చండీ హోమం వైభవంగా నిర్వహించారు. పెనుగొండ శాంతి నగర్‌లోని పద్దాల వెంకమ్మ ఆలయంలో హారతులు ఇచ్చి పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

భీమవరం: పట్టణంలోని జంక్షన్ రైల్వే స్టేషన్ వద్ద గల వాటర్‌ట్యాంక్ ఎక్కి ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే నాగరాజు అనే వ్యక్తి వాటర్‌ట్యాంక్ ఎక్కి తనకు ఇల్లు కట్టించి ఇవ్వాలంటూ హంగామా చేశాడు. దీంతో అప్రమత్తమైన రైల్వే ఏఎస్సై వెంకటేశ్వరరావు, టౌన్ పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని, నాగరాజుకు నచ్చజెప్పి ట్యాంక్ కిందకు దింపి కుటుంబ సభ్యులకు అప్పగించారు.